క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాలకు బొడ్డేడ రూ.65 వేల విరాళం



రూ.65 వేల చెక్కును అందజేస్తున్న బొడ్డేడ ప్రసాద్, సుభాషిణి దంపతులు

మునగపాక: మునగపాక దళితవాడ రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, నాగ సుభాషిణి దంపతులు శనివారం రూ.65 వేల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రసాద్ దంపతులు అందించిన సాయానికి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, మళ్ల సంజీవరావు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, మందపాటి రాము, కాండ్రేగుల జగన్, పిన్నమరాజు రవీంద్రరాజు, గుంట్ల అప్పారావు, డొక్కా నాగభూషణం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



సీతారామాంజనేయ విగ్రహాలను ప్రతిష్టిస్తున్న రమణమూర్తిరాజు, బొడ్డేడ ప్రసాద్ తదితరులు

మునగపాక: స్థానిక దళిత వాడలో శనివారం సీతారామాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు సీతారాములకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వేదిక సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమస్యలు వింటున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో అందిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. గ్రామాల్లో వివాదాలను సాధ్యమైనంతలో పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాకుంటే ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తదితరులు ఉన్నారు.


దిమిలి మాజీ సర్పంచ్ కుటుంబానికి నేతల పరామర్శ




నాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ప్రభాకర్ రావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు శనివారం పరామర్శించారు. అచ్యుతాపురం పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, రాంబిల్లి పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడిని దర్శించుకున్న కంబాల, చిక్కాల





వినాయకుని సన్నిధిలో కంబాల, చిక్కాల తదితరులు

పాయకరావుపేట: మండలంలో గల మాసాహేబుపేట గ్రామంలోని వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నయా పంథా.. ఆయిల్ దందా

అచ్యుతాపురం సెజ్‌లో వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ తస్కరణ

మౌనం పాటిస్తున్న వివిధ శాఖల అధికారులు



అచ్యుతాపురం సెజ్ పరిధిలో ఆయిల్ దందాకు కోసం వినియోగిస్తున్న షెడ్లు

అచ్యుతాపురం: వందల కోట్ల టర్నోవర్ కలిగిన అచ్యుతాపురం సెజ్‌లో దొంగల ముఠాలు స్వైర విహారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి, అక్రమాలు జరిపే ఈ ముఠాలు అడ్డదారిలో వెళ్లే వారికి అండగా నిలుస్తూ రోజుకి లక్షల్లో కొల్లగొడుతున్నాయి. ఇక్కడ యథేచ్ఛగా కెమికల్ చోరీ జరుగుతోందని తెలుస్తోంది. ఈ రహస్య కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాల్సిన పలు విభాగాలు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెద్ద ఎత్తున దందా..

అచ్యుతాపురం–రాంబిల్లి మండలాల పరిధిలోని ఒక ఆయిల్ కంపెనీ నుంచి రోజుకి వందకు పైగా పెట్రోల్ బంక్‌లకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తుంటారు. దీనికిగాను వినియోగించే వాహనాల యజమానులు, డ్రైవర్ల సహకారంతో ఆయిల్ దందా నడుస్తున్నట్లు జోరుగా వినిపిస్తోంది.

మోసం ఎలా జరుగుతుంది?

22 వేల లీటర్ల నుంచి అంతకు పైగా సామర్థ్యం కలిగిన ఆయిల్ ట్యాంకర్లలో లోడింగ్ చేసిన పెట్రోల్, డీజిల్ కంపెనీ నుంచి పెట్రోల్ బంక్‌లకు చేరే లోపు అక్రమార్కులు దారి మధ్యలో ఏర్పాటు చేసిన రహస్య శిబిరాల్లో తెలివిగా తస్కరిస్తున్నారు. ఒక క్యాన్‌కు 22 లీటర్ల మోతాదులో ట్యాంకర్ నుంచి తీసిన ఆయిల్‌ను 1500 రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఇలా పెట్రోల్, డీజిల్‌తో బంక్‌లకు చేరుకున్న లారీలు అక్కడ నిర్దేశించిన మోతాదులో ఇంధనాన్ని సరఫరా చేసి వెళ్లిపోతున్నాయి. తస్కరణకు గురైై పెట్రోల్ తగ్గుతుంది కనుక నిర్దేశించిన మోతాదు కంటే ఆయా ఆయిల్ కంపెనీల్లో మరింత ఎక్కువ పెట్రోల్, డీజిల్ నింపుకుని అన్ని బంక్‌లు కోరిన ఇంధనం ఇచ్చి.. మిగిలింది దొంగతనంగా విక్రయిస్తున్నారు. ఇందుకు ఆయిల్ కంపెనీల్లో కూడా అక్రమార్కులకు వత్తాసు పలికే ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. ఇలా తక్కువ ధరకు దొరికిన ఆయిల్‌ను బ్లాక్‌లో వినియోగించే వారు కొందరైతే సొంతంగా ట్రాన్స్‌పోర్టు కలిగిన వారు కూడా భాగస్వామ్యం అవుతున్నారు. ఇలా తరిగిపోతున్న ఆయిల్ నష్టం ఎవరు భరిస్తున్నారనే అంశం బయటికి పొక్కడం లేదు. ఈ తతంగం అంతా కొందరు సిబ్బందికి తెలిసినప్పటికీ నెలవారీ మామూళ్లు వారి నోరు మూయిస్తున్నాయని పలువురి ఆరోపణ.



అచ్యుతాపురం ఏపీఐఐసీ భూముల్లో ఆయిల్ దందా శిబిరానికి వెళ్లేందుకు కాలువలు కప్పి వేసిన దారి

బెదిరింపులు.. బ్లాక్‌మెయిలింగ్...

ఈ ఆయిల్ దందాకుగాను సెజ్‌లోని కొన్ని మార్గాల్లో రోడ్డు పక్కన షెడ్లు నిర్మిస్తున్నారు. రోజుల వ్యవధిలోనే ఆయా శిబిరాలను మారుస్తున్నారు. ఒక ఆయిల్ వ్యాపారి, ఆవరాజాం పరిసరాల్లోని ఒక ట్రాన్స్‌పోర్టు యజమాని, పలు వాహనాలు కలిగిన మరో వ్యాపారి ఈ దందాలో కీలకమని తెలుస్తోంది. తమ కార్యకలాపాలను ప్రశ్నించే వారిని బెదిరించడం, లేని పోని కేసులు పెడతామని బ్లాక్‌మెయిల్ చేయడంతో స్థానికులు మౌనం పాటిస్తున్నారంటున్నారు. ఇటీవల కెమికల్ నిల్వల కేంద్రాలు, ఆయిల్ దందా శిబిరాల విషయం వెలుగులోకి వచ్చినా ఎవరిపైనా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతానికి ఆయిల్ కంపెనీల్లో బ్లాక్‌లో పెట్టిన ఒక లారీతో పాటు మరో 12 వాహనాల కదిలికలపై నిఘా పెట్టినట్లు సమాచారం.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



అరబుపాలెంలో తుప్పల తొలగింపును పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెం గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. గ్రామంలో తుప్పల తొలగింపు పనులను ఆయన శనివారం పర్యవేక్షించారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శరగడం యోగినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతి

అచ్యుతాపురం రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని శనివారం కలెక్టర్‌కు పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. చాలీ చాలని జీతాలతో పౌష్టికాహారం తీసుకోలేక అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. కనీస వేతనం రూ. 15 వేలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులతో కూడిన వేతనం, గ్రాట్యుటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల కన్వీనర్ ఆడారి నాగేశ్వర్రావు, నాగమణి, శ్రీరాములు, రమణ, కళ్యాణి, వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతో పరిశుభ్రమైన పరిసరాలు



ఉపమాకలో వీధుల్లో చెత్తను తొలగిస్తున్న అధికారులు , సిబ్బంది



కె.వెంకటాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు



పాయకరావుపేట పీఏసీఎస్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో సిబ్బంది



కైలాసపట్నంలో సర్పంచ్ నూకరత్నం ఆధ్వర్యంలో మహిళల ర్యాలీ

నక్కపల్లి: మండలంలో శనివారం వివిధ గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. పారిశుధ్య కార్మికులు తడిపొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛంధ్ర కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రం అవుతాయని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. దేవవరం, నక్కపల్లి, ఉపమాక, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గునిపూడి, నెల్లిపూడి తదితర గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు.

ఉత్సాహంగా స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర..

కోటవురట్ల: మండల పరిషత్, తహసీల్దార్, పశు సంవర్ధకశాఖ కార్యాలయాలల్లో పరిసరాలను శుభ్రపరిచారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఈవోపీఆర్డీ రఘురాం, ఏడీ పెట్ల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్రప్రదేశ్..

పాయకరావుపేట: పట్టణంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం స్వచ్ఛతా సేవ కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ సీఈవో పినపాత్రుని నాగభూషణం సమక్షంలో సిబ్బంది కార్యాలయాన్ని శుభ్రపరిచారు.

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రపై అవగాహన..

గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో జయప్రకాష్‌రావు అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఐఎస్ఎల్ మరుగుదొడ్డి విధానం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవోఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వర్మ, పీఆర్ఏఈ కచేరి, వెలుగు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం..

కోటవురట్ల: కై లాసపట్నంలో కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దండు కదిలింది. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ వాతావరణాన్ని సాధిద్దామంటూ నినదించారు. సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు



గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డులోని కొందరు అక్రమార్కులు రాత్రిళ్లు కొండను తవ్వేస్తున్నారు. ఈ విషయమై 'సాక్షి' దిన పత్రికలో శనివారం 'ఆగని గ్రావెల్ తరలింపు' శీర్షికన కథనం వెలువడింది. దీంతో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు స్పందించి సర్వే నంబరు 112లోని కొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు. ఎవరైనా గ్రావెల్ తవ్వకాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. తలయారీని అందుబాటులో ఉంచుతామని, అలాగే లోపలికి వాహనాలు ప్రవేశించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు



కోటవురట్ల పాఠశాలలో విద్యార్థులకు హాల్ టికెట్, పరీక్ష మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మి

కోటవురట్ల: ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలను సాధించాలని హెచ్‌ఎం ఎం.లక్ష్మి ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులతో అన్నారు. శనివారం హాల్ టికెట్‌తో పాటు పరీక్ష అట్ట, జామెట్రీ బాక్సు, పెన్ను ఇతర మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. మంచి ఫలితాలు వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, ప్రసాద్, పీడీ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలతో ఎంతో మేలు..

ఎస్.రాయవరం: మోడల్ పరీక్షలు రాస్తుంటే విద్యార్థుల్లో ఆందోళన తగ్గుతుందని అడ్డురోడ్డు సీఐ ఎల్. రామకృష్ణ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 17 నుంచి టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎక్కడిక్కడే పోలీస్ సిబ్బంది అందుబాటులోఉంటారని, అవసరమైన సహకారం తీసుకోవాలని సీఐ తెలిపారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కల్పన, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతుల సమస్యల పరిష్కారానికి డిమాండ్



మాట్లాడుతున్న కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్

అచ్యుతాపురం రూరల్: రావిపాలెం గ్రామ నిర్వాసిత రైతుల సమస్యలపై అధికారులు తీసుకుంటున్నవి తప్పుడు నిర్ణయాలంటూ జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మండిపడ్డారు. శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో ఆయన బార్క్ రావిపాలెం గ్రామ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. యలమంచిలి మాజీ శాసన సభ్యుడు కన్నబాబు రాజు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాకే భూ–సేకరణ గురించి ఆలోచించాలన్నారు. కానీ సమస్య అలాగే ఉన్నప్పటికీ కొందరు అధికారులు ప్రత్యేక చొరవతో ప్రస్తుత యలమంచిలి శాసన సభ్యులు తమకు అండగా ఉన్నారంటూ అక్రమంగా భూ–సేకరణ జరిపి రావిపాలెం గ్రామ రైతులకు పునరావాసం కల్పించకుండా అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దొప్పెర్ల, రావిపాలెం గ్రామాలకు సంబంధించిన 150 నుండి 200 ఎకరాల డి–పట్టా భూములకు చెల్లింపులు జరగలేదన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 5 సెంట్ల భూమి ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుండా భయభ్రాంతులకు గురి చేసి అక్రమంగా భూ–సేకరణ చేయదలిస్తే బార్క్ పనులు ఒక్కటి కూడా చేయనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శించిన చిక్కాల



పులగల రామును పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలో గల వి.కొత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తి, అప్పా జిల్లా అధ్యక్షుడు పులగల రాము తండ్రి మరణించారు. ఈ సందర్భంగా రామును పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. ఈయనతో పాటు పార్టీ మండల ఏస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, సీనియర్ నాయకులు బావవరపు అప్పారావు, ఎంపీపీ, పాఠశాల చైర్మన్ బావవరపు శ్రీనివాసరావు, రాయి సురేష్, రాయి గంగధర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న రెండు లారీలు సీజ్

మునగపాక: ఎటువంటి రికార్డులు లేకుండా నడుపుతున్న రెండు లారీలను మైన్స్ అధికారులు సీజ్ చేశారు. అధిక లోడుతో బండ రాళ్లను తరలిస్తున్న రెండు లారీలను శనివారం నాగులాపల్లి వద్ద మైన్స్ ఏడీ అశోక్‌కుమార్ పట్టుకున్నారు. సంబంధిత లారీలను మునగపాక పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎవరైనా అధిక లోడుతో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాటు సారా తయారీ చట్ట విరుద్ధం

పాయకరావుపేట: నాటు సారా తయారీ, అమ్మకం చట్ట విరుద్ధమని ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో గల గజపతినగరం, రాజానగరం, కుమారపురం గ్రామాల్లో నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారు చేసినా, అమ్మినా మండల మేజిస్ట్రేట్ బైండోవర్ కేసులు, జరిమానాలు విధిస్తారన్నారు.

గ్రామాల్లో సీపీఎం ప్రజా చైతన్యయాత్రలు

రాంబిల్లి(అచ్యుతాపురం): మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం ప్రజా చైతన్యయాత్రలు శనివారం నిర్వహించారు. జడ్ చింతువ శివారు లోవపాలెం, గజిరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించిన సీపీఎం బృందానికి స్థానికులు నీటి సమస్య గురించి వివరించారు. సీఎస్ఆర్ నిధులు కేటాయించి మంచి నీటి వనరులు కల్పించాల్సిన కంపెనీలు సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు. సెజ్ కోసం వందలాది ఎకరాల భూమి ఇచ్చినప్పటికీ తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, మండల కేంద్రానికి సమీపంలో ఉన్నప్పటికీ మంచి నీటి సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగమంత్రి నారాయణరావు, ఎర్రిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

మండలంలో టెన్త్ పరీక్షలు రాయనున్న 1116 మంది విద్యార్థులు

ఎస్.రాయవరం: మండలంలో అయిదు పరీక్షా కేంద్రాల్లో 1116 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో 1 పి. అప్పారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాల పరీక్షా కేంద్రంలో 171 మంది, ఎస్.రాయవరం కేంద్రంలో 257 మంది, దార్లపూడి లో 214, కొరుప్రోలులో 238, ఆదర్శ ప్రైవేటు పాఠశాలలో 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. మండలంలో 15 ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా, మహాత్మగాంధీ జ్యోతిరావుపూలే పాఠశాలల పరిధిలో ఉన్న గ్రామాల నుంచి అయిదు పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు హాజరవుతారన్నారు.

రూ.21.05 లక్షలకు సంత వేలం పాట ఖరారు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో వారపు సంత, మేకల కమేళా రోజువారీ మార్కెట్ ఆశీలు వసూలుకు సంబంధించి వేలంపాట శనివారం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. నలుగురు వ్యక్తులు వేలం పాటలో పాల్గొనగా రూ.21.05 లక్షలకు వేలం పాట ఖరారైందని రెవెన్యూ అధికారి టి. విశ్వేశ్వరరావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి వరకు ఏడాది పాటు ఆశీలు వసూలు చేసుకునేందుకు పాట ఖరారైన వారికి ఉంటుంది. వేలం పాటలో పాల్గొన్న నలుగురు వ్యక్తులు రూ.5 లక్షల చొప్పున ధరావతు చెల్లించారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా అప్పలరాజు



ఇన్‌చార్జి ఎంపీపీగా అప్పలరాజుకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సత్యనారాయణ

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం మండల ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా ఉన్న చోడిపల్లి అప్పలరాజుకు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల కోన లోవలక్ష్మి ఈ నెల 11న జిల్లా పరిషత్ అధికారులకు రాజీనామా పత్రం సమర్పించడంతో శనివారం మండల పరిషత్‌కి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజుకి ధ్రువీకరణ పత్రం అందజేసినట్టు చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎంపీపీ జి.శిరీష అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంపై చర్చించారు. గ్రామాల్లో ఉన్న సమస్యల్ని పరిష్కరించాలని ఎంపీపీ శిరీష కోరారు. కాగా సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కొందరు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన పనుల్ని పూర్తి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు, వైస్ ఎంపీపీ కొఠాపు లక్ష్మి, కసిరెడ్డి నర్సింగరావు, ఈవోపీఆర్‌డీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల: కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజినీరు వి.డి.వి.రామకృష్ణ తెలిపారు. 33 కె.వి. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా కోటవురట్ల, రాట్నాలపాలెం, లింగాపురం, తంగేడు, జల్లూరు, సుంకపూరు, బి.కె.పల్లిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాలు మెరుగు

కె.కోటపాడు : ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు మెరుగుపడతాయని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. మండలంలో గుల్లేపల్లి, చౌడువాడ గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె ఇంకుడు గుంతలు, ఎరువు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఇంకుడు గుంతలు ఉంటే నీటి ఎద్దడి ఉండదని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కొలతల మేరకు ఇంకుడు గుంతల నిర్మాణం జరిపితే ఒక్కో నిర్మాణానికి రూ.6500 నగదు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఇంకుడు గుంతల నిర్మాణం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం చౌడువాడ గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీడీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎరుకునాయుడు, పంచాయితీ కార్యదర్శి సురేష్, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.